భ్రూణ హత్యలకు పాల్పడితే చర్యలు

- అధికారులు పారదర్శకంగా సేవలందించాలి
- జడ్పీ సర్వసభ్య సమావేశంలో జడ్పీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి
- గైర్హాజరైన ఎక్సైజ్ శాఖ అధికారులపై ఆగ్రహం

మాట్లాడుతున్న నాగజ్యోతి

ములుగురూరల్, మార్చి 5 : భ్రూణ హత్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ములుగు జడ్పీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి హెచ్చరించారు. మంగళవారం జడ్పీ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. వివిధ శాఖల అధికారులు వారి ప్రగతి నివేదికలను సభ ముందుంచారు. ఆయా శాఖల ప్రగతిపై నాగజ్యోతి సమీక్షించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సమీక్షలో భాగంగా వాజేడు మండలం గుమ్మడిదొడ్డి, ఏడ్జర్లపల్లి గ్రామాల్లో ప్రబలుతున్న వైరల్ జ్వరాలు, ఆరోగ్య సమస్యల పరిష్కారం కోసం చర్యలు తీసుకోవాలన్నారు. ఏటూరునాగారంలో మహిళల కోసం కుటుంబ నియంత్రణ శిబిరాలు ఏర్పాటు చేయాలని, లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తున్న వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌వోను ఆదేశించారు. వేసవిని దృష్టిలో ఉంచుకొని నీటి ఎద్దడి లేకుండా చూడాలని, మిషన్ భగీరథ పనుల్లో భాగంగా గ్రామాల్లో పాడైన రోడ్లకు మరమ్మతు చేయాలని ఆ శాఖ అధికారులను ఆదేశించారు. రైతులకు పెట్టుబడి సాయం అందించాలని, రైతు బీమా అమలులో జరుగుతున్న జాప్యాన్ని నివారించాలని వ్యవసాయ శాఖ అధికారులకు సూచించారు. విద్యా శాఖలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలన్నారు. ఇసుక సీనరేజీ నిధులు ఎందుకు స్థానిక సంస్థల ఖాతాలో కాకుండా రాష్ట్ర ప్రభుత్వ ఖాతాలో జమ చేస్తున్నారని, మినరల్ సీనరేజీ నిధులు జడ్పీ ఖాతాలో జమ అయ్యేలా చూడాలన్నారు. ఇసుక రీచ్‌ల నిర్వహణలో స్థానిక సొసైటీల పాత్ర లేకుండా కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని, వారి ఆగడాలను అరికట్టి గిరిజనులకు న్యాయం చేయాలన్నారు. పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ శాఖ మేడారం పనుల్లో నాసిరకం పనులు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పలు శాఖల అధికారులు ఎజెండా నోట్స్‌ను జడ్పీ కార్యాలయానికి సకాలంలో అందజేయాలని జడ్పీ చైర్‌పర్సన్ అన్నారు. జిల్లా స్థాయి అధికారులు సైతం సమావేశానికి సమగ్ర సమాచారంతో హాజరు కావాలన్నారు. సమావేశానికి గైర్హాజరైన ఎక్సైజ్ అధికారులపై నాగజ్యోతి ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి అధికారి విధిగా సమావేశానికి రావాలని, లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం ధాన్యానికి 50 శాతం అదనంగా మద్దతు ధర అందించాలని సభలో ఏకగ్రీవ తీర్మా నం చేశారు. ఈ సమావేశంలో జడ్పీటీసీలు రుద్రమదేవి, తుమ్మల హరిబాబు, నామ కరంచంద్ గాంధీ, తల్లాడి పుష్పలత, పాయం రమణ, జడ్పీ కోఆప్షన్ సభ్యులు వలియాబీ, రియాజ్ మీర్జా, ఎంపీపీలు సూడి శ్రీనివాస్‌రెడ్డి, బుర్ర రజిత, జనగం సమ్మక్క, జడ్పీ డిప్యూటీ సీఈవో రమాదేవి పాల్గొన్నారు.

ప్రభుత్వంపై ధర్మయుద్ధం చేద్దాం

- పాపమని గెలిపిస్తే కాంగ్రెస్ శాపమైంది
- ప్రజలకు అందుబాటులో ఉంటా
- పార్టీ మారిన వారు పశ్చాత్తాప పడతారు
- భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర

సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గండ్ర

కృష్ణకాలనీ, మార్చి 5 : పేదలకు అన్యాయం చేస్తే కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల పక్షాన ధర్మయుద్ధం చేద్దామని భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయంలో గణపురం మండలాధ్యక్షుడు మోతె కరుణాకర్‌రెడ్డి అధ్యక్షతన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన గండ్ర మాట్లాడుతూ ప్రజలు పాపమని కాంగ్రెస్‌ను గెలిపిస్తే.. ఆ పార్టీ నాయకులు శాపంగా మారారన్నారు. బీఆర్‌ఎస్ శ్రేణులు అధైర్య పడొద్దని, 24 గంటలు నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటానన్నారు. కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటానని, వారి కష్ట సుఖాల్లో పాలుపంచుకుంటానని హామీ ఇచ్చారు. బీఆర్‌ఎస్‌ను వీడిన వారు పశ్చాత్తాప పడే రోజులు వస్తాయన్నారు. అధికార కాంగ్రెస్ కోరిన 100 రోజుల సమయం త్వరలోనే ముగియనుందని, ప్రభుత్వ వైఫల్యాలను ఎప్పటికప్పుడు ప్రజలకు తెలపాలన్నారు. నిరుత్సాహంగా ఉన్న బీఆర్‌ఎస్ కార్యకర్తలకు మండల స్థాయి నాయకులు ధైర్యం చెప్పాలని, తాను కూడా గ్రామాల్లో పర్యటిస్తానన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై రాష్ట్ర ప్రభుత్వం కుట్రపూరిత రాజకీయాలు చేస్తున్నదని, మూడు పిల్లర్లు కుంగితే నీళ్లను ఆపేసిందని, దీని వల్ల పంటలు ఎండిపోయి రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి పనులకు అధికారులు వెంటనే బిల్లులు చెల్లించాలని, ఎవరో చెప్తే ఇస్తాననడం సరికాదన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ గెలుపు కోసం నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని సూచించారు. సమావేశంలో ఏఎంసీ మాజీ చైర్మన్ పోలుసాని లక్ష్మీనరసింహారావు, పీఏసీఎస్ మాజీ చైర్మన్ పోరెడ్డి పూర్ణచంద్రారెడ్డి, మహిళా అధ్యక్షురాలు మేకల రజిత, ఎంపీటీసీ అశోక్ రెడ్డి, నాయకులు మధుసూదన్‌రావు, దేవేందర్, శ్రీనివాస్, కుమార స్వామి, రామచంద్రారెడ్డి, రజియా, బైరగాని కుమారస్వామి, రవీందర్, బోయిన సాంబయ్య, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

'గట్టమ్మ' వివాదంపై ప్రభుత్వం తేల్చాలి

ములుగురూరల్, మార్చి 5 : గట్టమ్మ ఆలయ వివాదంపై ప్రభుత్వ స్పందించి ఏదో ఒకటి తేల్చాలని ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ తెలంగాణ (మెపా) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవేందర్ మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కోర్టు మధ్యంతర ఉత్తర్వులు ముదిరాజ్‌లకు ఇచ్చిందన్నారు. కాగా, గట్టమ్మ వద్దకు వెళ్లి కొబ్బరికాయలు కొట్టేందుకు వెళ్లిన ముదిరాజ్‌లపై నాయకపోడ్‌లు తోసేసి ఘర్షణకు దారి తీశారని ఆరోపించారు. పోలీసు ల ఎదుటే ఇరువర్గాల మధ్య తోపులాట జరిగిందని, ముదిరాజ్‌లపై అట్రాసిటీ కేసులు పెట్టడం ఎంత వరకు సమంజసమన్నారు. ప్ర భుత్వం పునరాలోచించాలని, కోర్టు ఆర్డర్‌ను అమలు చేయాలని పేర్కొన్నారు.

గుమ్మడిదొడ్డిలో వైద్యుల ఇంటింటి సర్వే

వాజేడు, మార్చి 5 : మండలంలోని గుమ్మడిదొడ్డి గ్రామంలో మంగళవారం వాజేడు వైద్యాధికారుల బృందం ఇంటింటా సర్వే చేపట్టింది. కీళ్ల నొప్పులు, జ్వరాలు, మోకాళ్ల నొప్పులతో బాధపడుతున్న వారి నుంచి రక్త నమూనాలు సేకరించి శాంపిల్స్‌ను జిల్లా కేంద్రానికి పంపింద్చరు. కార్యక్రమంలో వైద్యాధికారులు కొమురం మహేందర్, మధుకర్, హెల్త్ సూపర్‌వైజర్ కోటిరెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

'బిల్ట్ ఫ్యాక్టరీని ఎవరూ కొనొద్దు'

మంగపేట, మార్చి 5 : మండలంలోని కమలాపురం బిల్ట్ ఫ్యాక్టరీని తమ వేతన సమస్య పరిష్కారమయ్యే వరకూ ఎవరూ కొనొద్దని పలువురు సీనియర్ కార్మికులు కోరారు. మంగళవారం వారు మాట్లాడుతూ కార్మిక లీడర్లు యాజమాన్యంతో కుమ్మక్కయి వందలాది మంది కార్మికులను వీధిన పడేశారని వాపోయారు. వారి మాటలు విని బయట పనులకు వెళ్లకుండా ఫ్యాక్టరీకి వెళ్లి హాజరు వేయించుకుంటేనే జీతాలు వస్తాయనుకొని నిండా మునిగామని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక్కో కార్మికుడికి సీనియార్టీ ప్రాతిపదికన రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు రావాల్సి ఉండగా, కేవలం రూ. 50 వేల నుంచి రూ. 3 లక్షల వరకు తమ ఖాతాల్లో వేసి చేతులు దులుపుకున్నారన్నారు. చేసిన అప్పులు తీర్చలేక చాలా మంది కార్మికులు ఆత్మహత్యలకు పాల్పడ్డారన్నారు. తమకు న్యాయంజరిగేంత వరకు కర్మాగారాన్ని ఎవరూ కొనవద్దని వేడుకుంటున్నారు.

ఆలయ కమిటీ చైర్మన్‌గా ప్రసాద్

ఏటూరునాగారం, మార్చి 5 : ఏటూరునాగారం రామలింగేశ్వర స్వామి ఆలయ కమిటీ చైర్మన్‌గా మడుగూరి ప్రసాద్‌ను నియమించారు. ఈ మేరకు ఎండోమెంట్ కమిషనర్ అనిల్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. సభ్యులుగా వీ తిరుపతి, డీ కొమురయ్య, సోమందపు నర్సింహులు, పీ అర్జున్, చెన్నం లాలమ్మ, ఈ పూర్ణచందర్, ఈ రామ్‌లాల్, కర్ల అరుణ్, కట్కూరి రాధిక, గార పోశాలును నియమించారు.

'గృహలక్ష్మి'లో పేదలకు ప్రాధాన్యం ఇవ్వాలి

ములుగురూరల్, మార్చి 5 : గృహలక్ష్మీ పథకంలో పేదవారికి ప్రాధాన్యం ఇవ్వాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి జంపాల రవీందర్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని రిటైర్డ్ ఉద్యోగుల భవనంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 11 నుంచి ప్రారంభమయ్యే పథకంలో అధికారులు ఇళ్లు లేని వారిని గుర్తించాలన్నారు. ప్రభుత్వ స్థలాలు కొందరి ఆధీనంలోనే ఉన్నాయని వాటిని స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం సీపీఐ గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. కార్యదర్శిగా బోడ రమేశ్, సభ్యులుగా ఇంజం కొమురయ్య, కొండయ్య లక్ష్మి, ఎస్డీ అఖిల్, ఎండీ ఫయాజ్, బండ రాజును ఎన్నుకున్నారు. సమావేశంలో మండల కార్యదర్శి ముత్యాల రాజు, నాయకులు ఎండీ అఫ్జద్ పాషా, రాజు తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

భూపాలపల్లి ఎమ్మెల్యే సత్యనారాయణరావు

గ్యాస్ సిలిండర్ పథకాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

కృష్ణకాలనీ/రేగొండ/గణపురం/మొగుళ్లపల్లి, మార్చి 5 : పేద ప్రజల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మంగళవారం భూపాలపల్లి పట్టణంలోని 24, 25 వార్డుల్లోని కారల్‌మార్క్స్ కాలనీలో రూ. 500కే గ్యాస్ సిలిండర్ పథకాన్ని ప్రారంభించారు. రేగొండ మండల కేంద్రంలో సీసీ రోడ్లు, గోరికొత్తపల్లి మండలంలోని వెంకటేశ్వర్లపల్లె, గాంధీనగర్, విజ్జయ్యపల్లెలో నూతన జీపీ భవనాలకు శంకుస్థాపన చేశారు. గణపురం, మొగుళ్లపల్లి మండలాల్లోని పలు గ్రామాల లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గణపురం మండలం గాంధీనగర్ గుట్టమీద 200 ఎకరాల్లో ఇంటిగ్రేటెడ్ హాస్టల్స్, పాఠశాలలు, కళాశాలలు కట్టించి జిల్లాను ఎడ్యుకేషన్ హబ్‌గా తీర్చిదిద్దుతానన్నారు. ఆయా కార్యక్రమాల్లో మున్సిపల్ కమిషనర్ రాజేశ్వర్, భూపాలపల్లి తహసీల్దార్ శ్రీనివాసులు, కౌన్సిలర్లు శిరుప అనిల్, దాట్ల శ్రీనివాస్, ఉడుత సరోజన, ముంజాల రవీందర్, రేగొండ ఎంపీపీ పున్నం లక్ష్మి, మండల ప్రత్యేకాధికారి సామ్యూల్, ఎంపీడీవో వెంకటేశ్వర్‌రావు, గణపురం వైస్ ఎంపీపీ అశోక్, ఎంపీటీసీలు శివశంకర్‌గౌడ్, లావణ్య, భవిత, సుధర్మ, మొగుళ్లపల్లి తహసీల్దార్ సునీత, ఎంపీడీవో జోత్స్న, ప్రత్యేకాధికారి సునీత పాల్గొన్నారు.

మహా శివరాత్రి ఏర్పాట్లు పూర్తిచేయాలి

కాళేశ్వరం, మార్చి 5 : కాళేశ్వర ముక్తీశ్వర స్వామి ఆలయంలో గురువారం నుంచి నిర్వహించనున్న మహ శివరాత్రి ఉత్సవాల ఏర్పాట్లను త్వరగా పూర్తి చేయాలని భూపాలపల్లి అడిషనల్ కలెక్టర్ వెంకటేశ్వర్లు సూచించారు. మంగళవారం కాళేశ్వరంలోని వివిధ ప్రాంతాల్లో చేపట్టిన పనులను ఈవో మారుతితో కలిసి పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు. ఆయన వెంట కార్యదర్శి సత్యనారాయణ తదితరులున్నారు.

మావోయిస్టులు జనంలోకి రావాలి

గోవిందరావుపేట, మార్చి 5 : మావోయిస్టులు వనం వీడి జనంలోకి రావాలని పస్రా సీఐ శంకర్ అన్నారు. మంగళవారం స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో మావోయిస్టులు జన జీవన స్రవంతిలో కలవాలని రూపొందించిన వాల్ పోస్టర్లను సీఐ, ఎస్సై మస్తాన్ పోలీస్ సిబ్బందితో కలిసి అంటించారు. లొంగిపోయిన మావోయిస్టులకు ప్రభుత్వం, పోలీసుల తరపున సరైన సహాయం అందిస్తామని తెలిపారు. కన్నవారితో కలిసి ప్రశాంతమైన జీవితాన్ని గడపాలని సూచించారు.

అర్హులందరికీ గ్యారెంటీ పథకాలు

ములుగు కలెక్టర్ ఇలా త్రిపాఠి

మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

ములుగురూరల్, మార్చి 5 : ప్రభుత్వం ప్రకటించిన గ్యారెంటీ పథకాలు అర్హులందరికీ చేరేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. మంగళవారం అదనపు కలెక్టర్లు శ్రీజ, మహేందర్‌జీలతో కలిసి కలెక్టర్ కలెక్టరేట్ నుంచి ప్రజాపాలన సేవా కేంద్రాల ఏర్పాటు, సాఫ్ట్‌వేర్‌లో వివరాల నమోదుపై మండల ప్రత్యేకాధికారులు, ఎంపీడీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రతి మండలంలో ఎంపీడీవో కార్యాలయంలో ప్రజాపాలన సేవా కేంద్రాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాపాలన సేవా కేంద్రాల ద్వారా కొత్త దరఖాస్తులు స్వీకరించడం లేదని, తప్పులను సవరించుకోవచ్చన్నారు. సిబ్బంది సాఫ్ట్‌వేర్ పనితీరు క్షేత్రస్థాయిలో పరిశీలించాలన్నారు. ముందుగా తెల్ల రేషన్‌కార్డు వివరాలు, తర్వాత గ్యాస్ కనెక్షన్ నంబర్, విద్యుత్ మీటర్ నంబర్లను వ్యాలిడేట్ చేయాలన్నారు.

ఉత్సవాలకు ఏర్పాట్లు చేయాలి

వెంకటాపూర్ : మహా శివరాత్రి సందర్భంగా రామప్పలో ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. మంగళవారం ఆమె రామప్ప ఆలయాన్ని సందర్శించారు. మూడు రోజులపాటు జరిగే ఉత్సవాల ఏర్పాట్లను కలెక్టర్ పరిశీలించి మాట్లాడారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ఆర్డీవో సత్యపాల్‌రెడ్డి, ఎస్సై రాజు, తహసీల్దార్ సదానందం, ఆర్ఐ రమేశ్ ఉన్నారు. అలాగే రామప్పలో పార్కింగ్ ప్రదేశాలను సీఐ రంజిత్‌కుమార్, ఎస్సై రాజుతో కలిసి డీఎస్పీ రవీందర్ పరిశీలించారు.

ఆశ్రమ పాఠశాలలకు పల్స్ ఆక్సీమీటర్ల పంపిణీ

మంగపేట, మార్చి 5 : మండలంలోని చుంచుపల్లి గిరిజన, కస్తూర్బా గాంధీ బాలికల, బ్రాహ్మణపల్లి, తిమ్మంపేట, కోమటిపల్లి బాలుర ఆశ్రమ పాఠశాలలకు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ములుగు జిల్లా శాఖ ఆధ్వర్యంలో మంగళవారం పల్స్ ఆక్సీమీటర్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎంసీ సభ్యుడు కల్లె బోయిన సురేశ్, పాఠశాలల వార్డెన్లు, సిబ్బంది పాల్గొన్నారు.

రేపు మున్సిపల్ వైస్ చైర్మన్ ఎన్నిక

- ఆర్డీవో నుంచి కౌన్సిలర్లకు అందిన నోటీసులు
- మళ్లీ అవాంతరాలపై అనుమానాలు
- బీఆర్‌ఎస్‌కే దక్కనున్న పదవి

జయశంకర్ భూపాలపల్లి. మార్చి 5 (నమస్తే తెలంగాణ) : భూపాలపల్లి మున్సిపల్ వైస్ చైర్మన్ ఎన్నిక గురువారం మున్సిపల్ కార్యాలయంలో జరుగనుంది. ఎన్నికల కమిషన్ రెండోసారి ఇచ్చిన గడువు మేరకు ఈ నెల 7న ఎన్నికకు హాజరుకావాలని 30 మంది కౌన్సిలర్లకు ఆర్డీవో నోటీసులు పంపించారు. బీఆర్‌ఎస్‌కు చెందిన వైస్ చైర్మన్ కొత్త హరిబాబు రాజీనామా చేయడంతో ఈ ఎన్నిక అనివార్యమైంది. అయితే వైస్‌చైర్మన్ ఎన్నిక నిర్వహించడంలో కలెక్టర్ తీవ్ర జాప్యం చేస్తున్నారని బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు ఎన్నికల కమిషన్‌ను ఆశ్రయించగా, గత నెల 13న ఎన్నిక నిర్వహించాలని ఆదేశాలిచ్చింది. అయితే అ సెంబ్లీ బడ్జెట్ సమావేశాల దృష్ట్యా ఎన్నికను వాయిదా వేయాలన్న స్థానిక ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు విజ్ఞప్తిని ఈసీ ఆమోదించింది. మళ్లీ బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు ఇటీవల ఈసీని కలిసి వినతి పత్రం సమర్పించడంతో ఈ నెల 7న ఎన్నిక నిర్వహించాలని కలెక్టర్‌కు ఆదేశాలిచ్చింది. దీంతో ఆర్డీవో ఎన్నికకు సభ్యులు, ఎక్స్ అఫీషియో సభ్యులు హాజరుకావాలని నోటీసులు పంపారు. భూపాలపల్లి మున్సిపాలిటీలోని 30 వార్డుల్లో ప్రస్తుతం బీఆర్‌ఎస్‌కు 16, కాంగ్రెస్‌కు 12, బీజేపీ, సీపీఐకి ఒకరు చొప్పున కౌన్సిలర్లున్నారు. ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ఎక్స్ అఫీషియో ఓటును వినియోగించుకోనున్నారు. అలా గే బీఆర్‌ఎస్ నుంచి ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీ దయాకర్ ఓటు హక్కు వినియోగించుకునే ఛాన్స్ ఉంది. దీంతో బీఆర్‌ఎస్‌కు 18, కాంగ్రెస్‌కు 13 ఓట్లు ఉ న్నాయి. దీంతో వైస్ చైర్మన్ పదవి బీఆర్‌ఎస్‌కే దక్కనుంది. కాగా, బీఆర్‌ఎస్ నుంచి గండ్ర హరీశ్‌రెడ్డి వైస్ చైర్మన్ పదవిని ఆశిస్తున్నారు. అయితే చివరి క్షణంలో ఎన్నికను ఆపేందుకు అధికార పార్టీ నాయకులు ఎలాంటి కుట్రలు పన్నుతారోనని బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఒకవేళ ఇదే జరిగితే పెద్ద ఎత్తున ఆందోళనలు చేసి అధికార పార్టీ వైఖరిని ఎండగట్టేందుకు బీఆర్‌ఎస్ సిద్ధమవుతున్నది.

ఘనంగా గండ్ర గౌతంరెడ్డి జన్మదిన వేడుకలు

కృష్ణకాలనీ, మార్చి 5 : జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయంలో ఆ పార్టీ యువజన నాయకుడు గండ్ర గౌతంరెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ యూత్, గౌతంరెడ్డి అభిమాన సంఘం నాయకులు కేక్‌కట్ చేసి, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు కట్ల వినయ్ కుమార్, కట్ల పూర్ణచందర్, పూసల యుగేంద్రాచారి, బెజ్జల వంశీ, జోరు రాజ్‌కుమార్, హర్షిత్ పాల్గొన్నారు.

వేడుకల్లో పాల్గొన్న నాయకులు

వేసవిలో తాగునీటి ఎద్దడి ఉండొద్దు

కాటారం, మార్చి 5 : వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపట్టాలని మిషన్ భగీరథ చీఫ్ ఇంజనీర్ శ్రీనివాసరావు అధికారులను ఆదేశించారు. మండలంలోని ఇబ్రహీంపల్లి, మహాముత్తారం మండలంలోని మాదారం గ్రామాల్లో మంగళవారం ఆయన పర్యటించారు. ఇబ్రహీంపల్లిలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. మిషన్ భగీరథ ద్వారా తాగునీరందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. ఎస్ఈ మల్లేశం, ఈఈలు మాణిక్‌రావు, నిర్మల, డీఈలు కిరణ్, రమేశ్, ఏఈలు రాజశేఖర్, కల్యాణ్, కార్యదర్శి మల్లికార్జున్ ఉన్నారు.

పట్టుబడిన కలప, ఎడ్లబండ్లు

టేకు కలప పట్టివేత

మహదేవపూర్, మార్చి 5 : మండలంలో ఎడ్ల బండ్లలో అక్రమంగా తరలిస్తున్న టేకు కలపను అటవీశాఖ అధికారులు పట్టుకొని స్వాధీనం చేసుకున్నారు. మండల అటవీశాఖ అధికారి కమల తెలిపిన ప్రకారం.. సోమవారం అర్ధరాత్రి మండలంలోని ఎన్కపల్లి శివారులోని వాగు మార్గం గుండా కాటారం వైపు రెండు ఎడ్ల బండ్లలో టేకు దుంగలను తరలిస్తున్నారని అందిన సమాచారం మేరకు అటవీశాఖ బీట్ అధికారి కృష్ణాకర్, సెక్షన్ అధికారి వరుణ్ సిబ్బందితో కలిసి తనిఖీలు చేశారు. కాగా, గుర్తు తెలియని వ్యక్తులు కలప దుంగలతో ఉన్న ఎడ్ల బండ్లను అక్కడే వదిలివేసి పారిపోయినట్లు గుర్తించారు. ఎడ్ల బండ్లను, దుంగలను స్వాధీనం చేసుకొని మండల కేంద్రంలోని అటవీశాఖ కలప డిపోకు తరలించి కేసు నమోదు చేశామని, కలప విలువ రూ. లక్ష ఉంటుందని కమల తెలిపారు.

మహిళ ఆత్మహత్య

వెంకటాపురం(నూగూరు), మార్చి 5: మండలంలోని విజయపురి కాలనీలో ఓ మహిళ పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నది. పోలీసుల కథనం ప్రకారం.. కాలనీకి చెందిన గగ్గురి పోశమ్మ (27) భర్త శ్రీశైలం మద్యానికి బానిసై కుటుంబ బాధ్యతను పట్టించుకోవడంలేదు. వ్యవసాయ పనులకు సైతం వెళ్లకుండా ఇబ్బందులు పెడుతుండడంతో మనస్తాపానికి గురైన పోశమ్మ సోమవారం పురుగుల మందు తాగింది. కుటుంబ సభ్యులు ఎదిర వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో భద్రాచలం ఏరియా వైద్యశాలకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందింది. మృతురాలి తండ్రి వాదం ముత్యాలరావు ఫిర్యాదు మేరకు ఎస్సై అశోక్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుడుంబా అమ్మకాలను అరికట్టాలి

మంగపేట, మార్చి 5 : మండలంలో విచ్చలవిడిగా అమ్ముతున్న గుడుంబాను అరికట్టాలని ఎమ్మార్పీఎస్ మండల నాయకుడు గుగ్గిల్ల సురేశ్ మాదిగ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో నాటు సారా అమ్మకాలు పెరుగుతున్నాయన్నారు. ప్రజలు గుడుంబాకు బానిసై అనారోగ్యాలపాలై అర్ధాయువుతో మృతి చెందుతున్నట్లు తెలిపారు. ఎక్సైజ్ శాఖ అధికారులు పట్టించుకోకపోవడం లేదని ఆయన ఆరోపించారు.

భూ సమస్యలపై అవగాహన ఉండాలి

- పోలింగ్ కేంద్రాల్లో సదుపాయాలు కల్పించాలి
- భూపాలపల్లి కలెక్టర్ భవేశ్ మిశ్రా

వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్

భూపాలపల్లి రూరల్, మార్చి 5 : భూ సమస్యలపై తహసీల్దార్లకు అవగాహన ఉండాలని భూపాలపల్లి కలెక్టర్ భవేశ్ మిశ్రా అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో ధరణి, సీఎం ప్రజావాణి, పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పన తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ధరణి భూ సమస్యల పరిష్కారంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. సీఎం ప్రజావాణి నుంచి జిల్లాకు 64 అర్జీలు రాగా వాటిలో ఆరింటిని పరిష్కరించామన్నారు. జిల్లాలోని పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. ఈ సందర్భంగా గణపురం తహసీల్దార్ మురళీధర్‌కు షోకాజ్ జారీ చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

అర్హులకు పథకాలు అందాలి

అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలని కలెక్టర్ భవేశ్ మిశ్రా ఎంపీడీవోలను ఆదేశించారు. ఆరు గ్యారెంటీల అమలుపై ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్‌తో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎంపీడీవో, మున్సిపల్ కార్యాలయాల్లో ప్రజాపాలన సేవా కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. వివరాలు సరిగా నమోదు చేసుకోని వారు సేవా కేంద్రాల ద్వారా అప్‌డేట్ చేసుకోవాలని సూచించారు. అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, అసిస్టెంట్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్, జడ్పీసీఈవో విజయలక్ష్మి, డీఆర్డీవో నరేశ్, ఆర్డీవో మంగీలాల్, డీపీఆర్వో శ్రీనివాస్ పాల్గొన్నారు.

పీహెచ్‌సీ, పాఠశాలను తనిఖీ చేసిన పీవో

కన్నాయిగూడెం, మార్చి 5 : మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, గిరిజన బాలుర సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలను ఐటీడీఏ పీవో చిత్రమిశ్రా మంగళవారం తనిఖీ చేశారు. పీహెచ్‌సీలో హాజరు రిజిస్టర్లను పరిశీలించారు. మెడికల్ ఆఫీసర్ ఫీల్డ్ డ్యూటీ ఉన్నా, గైర్హాజరైన ఎంఎల్‌హెచ్‌పీ లేదా సూపర్‌వైజర్ అందుబాటులో ఉండాలని ఆదేశించారు. అనంతరం గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలకు చేరుకొని మరుగుదొడ్లు, డార్మెటరీ, తరగతి గదులను పరిశీలించారు. పాఠ్యపుస్తకం చదివించి విద్యార్థుల బోధ న శక్తిని తెలుసుకున్నారు. షెడ్యూల్ ప్రకారం కంప్యూటర్, ల్యాబ్‌ను తప్పని సరిగా వినియోగించుకోవాలన్నారు. రాబోయే వారాల్లో డీడీటీడబ్ల్యూ, డిప్యూటీ డీఎంహెచ్‌వో, ఐటీడీఏ అధికారులు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలను తనిఖీ చేయాలన్నారు.

ఉద్యోగాలు ఆదివాసీలకే కేటాయించాలి

ములుగురూరల్, మార్చి 5 : వైద్య, ఆరోగ్యశాఖలో జీవో నంబర్ 68 నియామకాలను చేపట్టాలని కోరుతూ ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా కన్వీనర్ పర్శిక సతీశ్ మంగళవారం డీఎంహెచ్‌వో అల్లెం అప్పయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవో ప్రకారం వైద్య శాఖలో ఎన్‌ఆర్‌హెచ్‌ఎం విభాగంలో ఖాళీగా ఉన్న వైద్యాధికారులు, స్టాఫ్‌నర్సులు, పిల్లల వైద్య నిపుణులు, ఎంఎల్‌హెచ్‌పీ, ఫార్మసిస్ట్‌ల్లో ఉద్యోగ నియామకాలు 100శాతం ఆదివాసీలకు కల్పించాలన్నారు. ఏటూరునాగారం డివిజన్ అధ్యక్షుడు బుచ్చయ్య, మహిళా విభాగం మండలాధ్యక్షురాలు పాయం భారతి, ఉపాధ్యక్షులు అరుణకుమారి, సూర్యప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుతో అధిక లాభాలు

జిల్లా ఉద్యాన అధికారి సంజీవరావు

ఆయిల్ పామ్ తోటను పరిశీలిస్తున్న సంజీవరావు

మహదేవపూర్, మార్చి 5 : ఆయిల్‌పామ్ సాగుతో రైతులు అధిక లాభాలు గడించవచ్చని జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఉద్యాన అధికారి సంజీవరావు అన్నారు. మంగళవారం ఆయన డివిజన్ ఉద్యాన అధికారి డీ రమేశ్‌తో కలిసి మండల కేంద్రంతోపాటు సూరారం, అంబట్‌పల్లి, బొమ్మాపూర్ గ్రామాల్లో పర్యటించి ఆయిల్‌పామ్ పంటలను పరిశీలించారు. తోటల సస్యరక్షణ చర్యలు, యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. రైతులు ఆయిల్‌పామ్‌లో అంతర పంటలను సాగుచేస్తూ అదనపు ఆదాయాన్ని పొందవచ్చన్నారు. కార్యక్రమంలో రైతులు నారాయణ, వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలకు హక్కులు కల్పించిన రాజ్యాంగం

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జయరాంరెడ్డి


మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి జయరాంరెడ్డి

కృష్ణకాలనీ, మార్చి 5 : భారత రాజ్యాంగం మహిళలకు అనేక రకాల హక్కులను కల్పించిందని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కే జయరాంరెడ్డి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం జిల్లా కోర్టు ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. మహిళల శ్రేయస్సును కాంక్షించిన ఐక్యరాజ్య సమితి అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఏర్పాటు చేసిందన్నారు. కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి ఎన్ రామచంద్రరావు, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి అఖిల, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎదులాపురం శ్రీనివాస్, చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫె న్స్ కౌన్సిల్ మెరుగు రవీందర్, కంప అక్షయ, జీ ప్రియాంక, కోర్టు మహిళా సిబ్బంది, న్యాయవాదులు, న్యాయ సేవాధికార సంస్థ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చిన్నబోయినపల్లిలో మహిళా దినోత్సవ వేడుకలు

ఏటూరునాగారం: మండలంలోని చిన్నబోయినపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్ వైజర్ బీ వసంత మాట్లాడుతూ విద్య, ఉద్యోగాల రిజర్వేషన్లను ఉపయోగించుకోవాలని కోరారు. మహిళల చట్టాలు, హక్కులను వివరించారు. కార్యక్రమంలో వైద్యురాలు అనిమిషా, హెచ్ఎం కవిత, ఏఎన్ఎం పుణ్యవతి, అంగన్ వాడీ కార్యకర్తలు రమాదేవి, సుజాత, లక్ష్మి, ఇందిర పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షా కేంద్రాల పరిశీలన

ములుగురూరల్/ గోవిందరావుపేట, మార్చి 5 : ములుగు జిల్లా కేంద్రం, గోవిందరావుపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుగుతున్న ఇంటర్మీడియట్ పరీక్షలను మంగళవారం డీఎస్పీ రవీందర్, సీఐ శంకర్, ఎస్సై మస్తాన్ వేర్వేరుగా పరిశీలించారు. పరీక్షా కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన సౌకర్యాలను తనిఖీ చేశారు. డీఎస్పీ వెంట సీఐ మేకల రంజిత్‌కుమార్, ఎస్సై వెంకటేశ్వర్, కళాశాల ప్రిన్సిపాల్ వెంకన్న ఉన్నారు. కాగా, జిల్లా వ్యాప్తంగా జనరల్ విభాగంలో 1,704 మంది విద్యార్థులకు 1,661మంది హాజరు కాగా, 43 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ విభాగంలో 234 మంది విద్యార్థులకు 218మంది హాజరు కావాల్సి ఉండగా 16 మంది గైర్హాజరయ్యారు.

ఇంటర్ సెకండియర్ పరీక్షకు 39 మంది గైర్హాజరు

భూపాలపల్లి రూరల్: జయశంకర్ భూపాలపల్లిలో మంగళవారం నిర్వహించిన ఇంటర్మీడియట్ సెకండియర్ గణితం, వృక్ష, రాజనీతి శాస్త్రం, వృత్తి విద్యా కోర్సుల పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని నోడల్ అధికారి కే దేవరాజం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని 8 పరీక్షా కేంద్రాల్లో మొత్తం 1,669 మంది విద్యార్థులకు 1,630 మంది పరీక్షలు రాశారని, 39 మంది గైర్హాజరయ్యారని పేర్కొన్నారు.

అంబేద్కర్ ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌నకు దరఖాస్తులు

భూపాలపల్లి రూరల్, మార్చి 5 : జిల్లాలోని షెడ్యూల్డ్ కులాల విద్యార్థుల నుంచి అంబేద్కర్ ఓవర్సీస్ విద్యానిధి పథకానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి డీ సునీత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన వారు ఈ నెల 31 వరకు www.telangana epass. cgg.gov.in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సునీత కోరారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

PLOT FOR SALE

★మీ పిల్లల బంగారు భవిష్యత్తు కొరకు 2 వేలకు 1గజం భూమి, యాదగిరిగుట్ట దగ్గర @ ఆలేరు, జీడికల్లు రామాలయ, ప్రసిద్ద శివాలయం దగ్గర్లో, స్పాట్ రిజి. 100% వాస్తు. Cont: 9030769178. NTW-00

WANTED

★త్రివేణి హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. Ph: 9160900024 / 9640400073. NT-311802-All

CHANGE OF NAME

★I, DODDA LAXMI, W/o. Immadi Srinivas, R/o. 3-5, Gandhi Street, Chandrugonda, Warangal Dist., TS. Changed My Name as IMMADI SARITHA, W/o. Immadi Srinivas. NT-328074

★I, IMMADI SRINIVASULU, S/o. Immadi Ramaiah, R/o. 3-5, Gandhi Street, Chandrugonda, Warangal Dist., TS. Changed My Name as IMMADI SRINIVAS, S/o. Immadi Ramaiah. NT-328074

★I, CHANDA RAVI SHANKER, S/o. Chanda Venkat Rao, R/o. 1-5-71, Station Road, Mahabubabad Town & Dist., TS. Changed My Name as CHANDA RAVI SHANKAR, S/o. Chanda Venkat Rao. NT-328074

★I, POLPJU RAJ KUMAR CHARY, S/o. Krishnamachary, R/o. 2-1-47/C, Bhavani Nagar, Mahabubabad Town & Dist., TS. Changed My Name as POLOJU RAJ KUMAR CHARY, S/o. Poloju Krishnamachary. NT-328074

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

అతి తక్కువ ఖర్చు అత్యధిక ప్రచారం

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే

4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే

ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే

ప్రకటనల విభాగం : 9182777552

HANAMKONDA 9182777563 9182777618

WARANAGAL 9182777556 9182777557

JAYASHANKAR BHUPALPALLY - 9182777559

MULUGU - 9182777135

MAHABUBABAD - 9182777554

JANGAON - 9182777565